కథానిక

# ఆగని ఆకలిపాట

"జ్యేష్ఠ"

కళ్ళు తెరిచేటప్పటికి పిల్లగాలులు శరీరాన్ని చల్లగా సోకుతూ మెల్లగా పోతున్నాయి. చీకటి ఇళ్ళ వెనకాల నక్కి కూర్చుంది అక్కడక్కడ ఇళ్ళన్నీ నీడల్లాగున్నాయి. చింపిరి తలల్లాంటి చెట్ల వెనకనుంచి మేఘాలు లేని ఆకాశం తొంగి చూస్తోంది. పక్కనే మంచంమీద ఉష పసిపాపలా నిద్రిస్తోంది. డాబాపిట్ట గోడమీద కూర్చుని సిగరెట్ వెలిగించాను

పగలల్లా అల్లరిచేసి అలిసిపోయి నిద్రపోతున్న పాపలా ప్రశాంతంగా ఉంది వీధి వెలుగు నీడలు ప్రత్యర్థుల్లా ఉన్నాయి. ఒక కుక్క ముడుచుకు పడుకుంది వీధికడ్డంగా. ఓ బిచ్చగాడు తన సహజ రూపంలో వీధిచివర అగుపడ్డాడు. వాడికంటె ఆశాజీవి ఉండడు. తెల్లవారక ముందు నేనుపిలిస్తే వచ్చి నా కోరిక తీర్చేదెవరు? అనే ఆలోచన వాడిలో ఆకలికి ఏనాడూ ఉండదు. జీరలు వారుతున్న కంఠంతో శక్తికొద్దీ అరుస్తున్నాడు ప్రతీ అరుపూ నాభినుంచి వాడిన మోడులాంటి శరీరాన్ని కదలించివేస్తూ వస్తూంది.

వీధికడ్డంగా పడుకున్న కుక్కవాడి రాకని గౌరవించింది. వాడు తన పక్కనుంచి దాటిపోయేదాకా రోడ్డు పక్కని నిలుచుంది. వాడికి దాని గొడవ అనవసరం వాడి దారినవాడు పోయాక అది యథాస్థానాన్ని మేనువాల్చింది. కుక్కలో విప్లవభావాలు, స్వాతంత్రేచ్ఛవంటి వేవో ఉండి ఉండాలి. లేకపోతే అంత శ్రమదమాలుపడుడూ ఎవరేనా వస్తే లేవవలసివచ్చినా రోడ్డు మధ్యనే పరుండాలా!

బిచ్చగాడు తనవిధి నిర్వహించడానికి మాఇంటి ముందు ఆగేడు. వాడు గొంతు సవరించుకొంటుండగానే పెరట్లో కుక్క వాణ్ణి పలకరించింది. అది అరిస్తే ఇంట్లో వాళ్ళు దాన్నో హీరోలా చూస్తారు! దాని గొంతుకకి ఇంటిముందు బిచ్చగాడు వీధిలో కుక్కా కొద్దిగా భయపడ్డారు. బిచ్చగాడు కుక్క గొలుసునిమాసి గుండె దిటవు చేసుకొని అరిచాడు. కుక్క అరిచింది. వాడు యావచ్ఛక్తీ వినియోగించి అరిచాడు. "మూడు రోజుల్నుంచీ తిండి లేదమ్మా!" వాడి మాటలు వింటే నవ్వొచ్చింది నాకు. వాడు నిన్ననూ అదే మాటన్నాడు మొన్ననూ అదే మాటన్నాడు. సంవత్సరం క్రిందటా అంతే. వాడు మొదటనేర్చుకున్న వాక్యమేఅది! వాడు దాన్నే ఏమీ మార్చకుండా వాడుతున్నాడు. ధర్మాత్ములకి ఆమాట అర్థం అనవసరం. పిల్లికి బిచ్చంవేయని వారికీ అంతే!

వాడు అరవడం విరమించి ముందుకి సాగాడు. కుక్కా ఊరుకుంది; విజయ సూచకంగా 'గుర్ర్' అని, రోడ్డువేపుచూసి ఇంటిలోకి చూసింది. నౌకరు అప్పుడే తలుపులు తెరుస్తున్నాడు. ఉష కళ్ళు తెరిచింది.

"ఉషా! శుభోదయం" అన్నాను. "ఏఁవొచ్చింది?" ఉష బద్ధకంగా అడిగింది. సగం వెలిగిన ప్రకృతిలాగున్నాయి కళ్లు. "తరువాత చెప్తాలే" అన్నా. "చెప్పేదేదో ఇప్పుడే చెప్పరాదూ! సస్పెన్సు విధిగా ఉండాలేఁవిటి?" "కొద్దిగా వ్యవధి కావాలి" అన్నాను. "అప్పటివరకు నేనుండలేను బాబూ" ఉష అనేదేదో తొందరగా అనేసి విసురుగా మెట్లుదిగి వెళ్ళిపోయింది.

విద్యార్థి దశలో ఏవో ఆదర్శాలుంటాయి ప్రతివారికీని. రొమాంటిక్‌గా ఉంటాయి ఊహలు. 'సామాన్యుల్లా గుండకూడదు. పరిస్థితులకు లొంగకూడదు. మనలో ఓ ప్రత్యేకత ఉండాలి–' అలా ఉంటాయి ఉద్దేశాలు. కొందరికి మధ్యయుగపు హీరోల్లా కత్తియుద్ధాలు చెయ్యాలనీ, కొందరికి మేకప్ హీరోల్లా సాహసిక యాత్రలు చెయ్యాలనీ కొందరికి దేశసేవ చేయాలనీ... వాళ్లు పెద్దవాళ్ళ మాటల్లోనూ, గొప్పవాళ్ళ రచనల్లోనూ చూస్తూనే ఉంటారు—యౌవనపు ఆదర్శాలు వయస్సుతో మాయమౌతాయనీ పైగా కొన్ని సందర్భాలలో

కొంపలుకూడా ముంచుతాయనీని. కాని వాళ్ళను కునే దేమిటంటే తమ ఆదర్శాలు ఆ జాతిలో చేరవనీ, కక్తిలేనివనీ. ఆవిధంగా వంచింపబడ్డ సంగతి మరో పదేళ్ళకి తెలుస్తుంది వాళ్ళకి నాకు విద్యార్థి దశలో దొరికిన సాహిత్యం అటువంటిది. అది చదివి దాన్ని గురించే ఆలోచించేవాణ్ణి బిచ్చగాళ్ళని చూసి వాళ్ళస్థితికి నేనే కారణమైనట్లు సిగ్గుపడే వాణ్ణి. ఆకలి చావులూ అవీ పత్రికల్లో చూసి నాన్నగారిమీద విరుచుకుపడేవాణ్ణి. ఎవరిమీదో తెలియనికోపం. నాన్నగారు నా ఉపన్యాసాలు విని నవ్వేవారు. "ఏమిట్రా నువ్వనేది?"

"ఈనాటి దేశపరిస్థితులు" గట్టిగా అనేవాణ్ణి.

"అయితే ఏంచేయమంటావు నన్ను?" ఏం చేయమనను? చక్కగా నిష్క్రమించేవాణ్ణి.

"కాలువలో ఆత్మహత్య, రైలుకింద ఆత్మహత్య రోడ్డుప్రక్క యువతిశవం చచ్చిఉన్న పిల్లవాడు; అన్నీ ఒకచోటకాదు.. అన్నీ ఒకనాడూ కాదు.. కాని అన్నీ ఒకచోటనుండి ఆకలినుంచి—అసహాయతనుంచి, నిరాశనుంచి, బలహీనతనుంచి అన్నీ ఆకలి చావులే. ప్రెస్సుకెక్కేవి కొన్నిమాత్రమే కొన్నిమాత్రమే కన్నీరుపిండేవి. అన్నీ ఒకచోటుకే. కాలచక్రం ఇరుకు ఆకుల చీకట్లలోకి తెలిసి కొన్ని తెలియక కొన్ని..."

మేడమీదనుంచి క్రిందికి పరుగెత్తాను. నాన్నగారు స్నానానికి వెళుతున్నారు. "నాన్నగారూ" అన్నాను.

"ఏమిరా?"

"అబ్బే! ఏంలేదు." ఆయన నడుస్తున్నారు. అనుసరించాను.

"అదికాదు. దేశంలో ఆకలి విపరీతంగాఉంది. ఆకలి చావులు చూస్తున్నారు కదూ."

"ఆహా"

"మనబోటివాళ్ళు పూనుకొని..." నాన్నగారు నావేపు చూశారు.

"బిచ్చగాళ్ళకి ఏమైనా ఇవ్వకూడదూ?"

"అదా! చూద్దాంలే ముందు స్నానంచెయ్యనీ"

స్నానంచేసి వచ్చా నాన్నగారు..."ఏంచేద్దామంటావ్?" ఏంచెప్పాలో తెలియలేదు. "సరే రోజుకొక బిచ్చగాడికి తిండి పెట్టిద్దాం" అని నా వేపు చూశారు. "పోనీ ఇద్దరికీ. సరా!" తల ఊపాను. నాన్నగారు వంటవాడికి చెప్పారు.

పదకొండు గంటలైంది. బిచ్చగాళ్ళు కనపడ లేదు. నౌకరు వెళ్ళి ఇద్దర్ని పట్టుకొచ్చాడు. వాళ్ళిద్దరూ బిచ్చగాడు అంటే సరైన నిర్వచనం ఇచ్చేస్తున్నారు. అసలైన సిసలైన బిచ్చగాడు ఎలా ఉంటాడో వాళ్ళరూపాలు చెప్తున్నాయి. చింకి పాతలు ఎముకల పోగులు కళా కాంతులులేని కళ్ళు దుబ్బుజుట్టు ముఖంలో ప్రతి కణంలో ఆకలి శరీరంలో అణువణువులో దారిద్ర్యం ఆకారంలో ప్రతి కోణంలో దేవుడి పక్షపాతబుద్ధి.

భోజనంచేసి తృప్తిగాలేచారు. వాళ్ళభాషలో కృతజ్ఞత తెలిపారు. "వాళ్ళ దీవెనలేని నిజమైతే" గుండెలు జలదరించాయి. వెయ్యేళ్ళు బతకాలట! ఇంటినిండా పిల్లలుట! వాళ్ళని బయటికి నెట్టించవలసివచ్చింది వాళ్ళ వాక్ప్రవాహాన్ని ఆపడానికి!

మరునాడు తెల్లవారకుండా వీధిలో గేటుకి అటొకడు ఇటొకడు నిలపడ్డారు వాళ్లు! అక్కడే కూర్చుని కునికిపాట్లు పడసాగేరు. వాళ్లు అడుక్కునే అవసరం లేదుగా! జన అరుపులు విని కదలక పోవడంచూసి కుక్కవాళ్ళతో స్నేహంచేసింది. మొండివాళ్ళకి కుక్కేనా లొంగవలసిందే.

రోజూ వచ్చే బిచ్చగాళ్ళు వీళ్ళనిచూశారు. కుక్క వీళ్ళని ఏమీ అనకపోవడంచూసి వాళ్ళూ ఆగేరు. కుక్కవాళ్ళని చూసి మొరిగింది. వాళ్లు వెళ్ళిపోయారు. ఇద్దరు మాత్రం మొండిగా కూర్చున్నారు వింత ఏమిటో చూద్దామని. కుక్క అరిచి అరిచి ఊరుకుంది. అంకెళ్లు పడిపోయాయి ఏం చేస్తుంది మరి!

ఆ రోజున మిగిలిన అన్నం అక్కడ పడేశాడు నౌకరు. కొత్తవాళ్ళు ముందుకొచ్చారు. పాతవాళ్లు కోపంగా చూశారు. కాని వాళ్ళు నలుగురూ రోజంతా ముష్టెత్తితే వచ్చేదానికి పదిరెట్లుందది. అందుచేత సంధి కుదిరింది. నలుగురూ మిత్రభావంతోనే పంచుకున్నారు.

తెల్లవారు ఝామున నాలుగవుతుందేమో అప్పుడు కుక్క మొరిగింది. నౌకరు లైటుపట్టుకొచ్చి చూశాడు. ఏముందక్కడ? నాలుగు ఆకారాలు ఉదయం వచ్చిన కొత్త బిచ్చగాళ్ళు, వాళ్ళ తాలూకువాళ్ళూను! మరికొంత సేపటికి

ముందొచ్చిన బిచ్చగాళ్ళొచ్చారు. ముందొచ్చిన చెవులకంటె వెనకొచ్చిన కొమ్ములు వాడి! కొత్త బిచ్చగాళ్ళు పాతవాళ్ళవంక అసహ్యంగా చూశారు. వాళ్ళు ధీమాతో నిలబడ్డారు. కుక్క ఇరువురియెడ స్నేహభావం చూపింది.

తిండిపెట్టే టైముకి దెబ్బలాట బయలుదేరింది. ముందొచ్చిన బిచ్చగాళ్ళు "మాదీ హక్కు" అన్నారు. వెనకొచ్చినవాళ్ళు ముందుకొచ్చారు. వాదన మొదలుపెట్టారు. "దీనిని కళ్లులేవండి." "ఈడికి కాళ్ళులేవండి" "మా యిద్దరికీ రోగాలండి" "మాకే ఎయ్యాలండి" "ఈళ్ళు నిన్నటికూడే దాచుకున్నారండి" ఇదంతా ముందొచ్చినవాళ్లు పిడికిళ్ళు బిగించి వింటున్నారు. అక్కడ చిన్న కుస్తీపోటీ జరగవచ్చు ననిపించింది. నౌకరుకి ఏం చెయ్యాలో తోచలేదు. ఎలాగో సర్ది పెట్టాడు.

వీళ్ళ ఆకలి యుద్ధాలు అవీ చూస్తూంటే జాలి కలుగుతుంది—నవ్వూవస్తుంది. ఏంచెయ్యాలి? ఇంటి ముందు దిష్టిబొమ్మల్లా ఆరుగురు వ్యక్తులు! ఇంటి ముందు కారాగితే దానిచుట్టూమూగి పరీక్షిస్తారు. ముట్టుకోవాలని చూస్తారు. పొమ్మంటే పోరు. ఎలాగా వీళ్ళతో! ఇప్పుడున్న ఆరుగురూ అరవై మందిని ఆకర్షించవచ్చు. అప్పుడు ఖర్చు భరించడం కష్టం.

మరునాడు మా యింటిముందు ఎలక్షను సభ లాంటిదొకటి జరిగింది. దాదాపు ముప్పైమంది బిచ్చగాళ్లు వాళ్ళవాళ్ళ యూనిఫారాలతో సమావేశమయ్యారు. కొద్దిలో ముష్టియుద్ధం జరిగే సూచనలు కనిపించాయి. గట్టిగా మాట్లాడేస్తున్నారు—అందరూ ఒక్కమారే; వినేవాళ్ళులేరు. వాళ్ళవాళ్ళ అర్హతల్ని గురించి ఉపన్యసిస్తున్నారు.

"నాకు కాలులేదు."

"కాలున్నోళ్ళకంటే నువ్వే బాగా నడవగలవు. కాలులేదనేనా ఇన్ని గింజలేత్తారు." వాళ్ళిద్దరూ జుట్టూజుట్టూ పట్టుకున్నారు. కొందరు ముష్టి పెద్దలు విడిపించారు.

ఇంతమందినీ ఏంచెయ్యాలో తెలియలేదు. పొమ్మంటే పోరు. కుక్కని ఉసికొలిపితే? ఛీ! తిండిపెట్టకపోగా ఈ పాడుపనికూడానా? మరెలాగ? వీళ్ళకిప్పుడు సంతర్పణ చెయ్యాలేమో! "అందరికీ తిండి పెట్టవలపిందే" అన్నారు నాన్నగారు. నేను కాదనక పోయాను. కాని భయం పట్టుకుంది. రోజూ ఇలా జరిగితే...!

దీనికి ఒకటే సాధనం—ఏ ముష్టివాణ్ణీ రానీయక పోవడమే! నాన్నగారితో చెప్పాలంటే సిగ్గుగా ఉంది. ఏంచెయ్యడం? ఆలోచించినకొద్దీ 'ఎవరికీ తిండిపెట్టకపోవడమే ఉత్తమం' అనిపించింది. కాని చెప్పడం ఎలా...! ఇప్పుడు బిచ్చగాళ్ళని రావద్దన్నా వాళ్ళు మానరు!

ఊరికి నాలుగుమైళ్ళ దూరంలో కొండలలో ఓ బంగ్లా అమ్మకానికి సిద్ధంగా ఉంది. అదికొందాం అన్నాను. సరే నన్నారు నాన్నగారు. "అక్కడ నా ఆరోగ్యంకూడా బాగుంటుంది" అన్నారు. ఆయన అమాయకత్వం చూస్తే గుండెల్లో పొడిచినట్లయింది.

ఉష అసలు విషయం కనిపెట్టింది. నావేపు జాలిగా చూసింది. "ఇక్కడకొచ్చిన బిచ్చగాళ్ళకే తిండి పెట్టవచ్చు" అంది. "ఛీ! ఆ కన్నీళ్ళేమిటి. ఈమాత్రం దానికేనా. ఊరుకోండి." అని కొంతసేపు ఆగి అంది "మొదట వచ్చిన బిచ్చగాళ్ళకి మనం రోజూ తిండిపెడతామని తెలియనివ్వడమే మనంచేసిన పొరపాటు!"

---

## లోక్ సభలో వినబడేవి

మిస్టర్ సాదత్ ఆలీఖాన్: "సిలోన్ పౌరులుగా మామూలు పద్ధతిలో తమ పేర్లు రిజిస్టరు చేసుకోలేనివాళ్లు సిలోన్ వాళ్లని పెళ్లి చేసుకుంటే పౌరసత్వం సంపాదించే మార్గం ఉందిగదా?"

ప్రధాని నెహ్రూ: "గౌరవనీయ సభ్యుని ప్రశ్న ఉత్త ప్రశ్నమాత్రంకాదు-అంతకంటె ఎక్కువది."